ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 26 అక్టోబరు 2025 | 5



ఎందుకింత నిర్లక్ష్యం

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ అసహనం
- కూడళ్ల వద్ద భక్తులకు సూచీబోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశం

7



నాగేంద్రునికి పూజలు

నాగుల చవితి పర్వదినాన్ని జిల్లా అంతటా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి పాముల పుట్టల్లో పాలు పోశారు. కోడి గుడ్లు ఉంచారు. చలిమిడి, చిమ్మిలి నైవేద్యంగా సమర్పించారు. అలాగే అన్ని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా పుట్టలు అధికంగా ఉండడంతో అంతటా ఇదే సందడి కనిపించింది. కాకినాడ కలెక్టరేట్‌లో ఉన్న పుట్ట వద్ద భక్తులు పూజలు చేస్తున్న దృశ్యమిది..



ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా..

పోలీసులు తమ విధుల్లో ఏం చేస్తుంటారు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరిస్తారు, ఏ ఆయుధాలు వాడుతుంటారు, దర్యాప్తులో ఏ పరికరాలు.. ఎందుకు వినియోగిస్తారు.. ఈ విషయాలపై సహజంగానే అందరికీ ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా విద్యార్థులకు పోలీసులు ఉపయోగించే గన్‌లు ఏమిటనే కుతూహలం ఎక్కువ ఉంటుంది. వీటన్నిటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కాకినాడలో ఎస్పీ జి.బిందుమాధవ్ శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో గన్ పనితీరును ఎస్పీ బిందుమాధవ్ వివరిస్తున్న దృశ్యమిది.

7



కాకినాడకు 900 కి.మీ

భయమొంథా!

దూసుకొస్తున్న తుఫాన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ వైపు మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ప్రచండ వేగంతో కదులుతూ తీరం వైపు దూసుకొస్తోంది. కాకినాడ పోర్టు - తుని మధ్య మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సోమ, మంగళ, బుధవారం మూడు రోజులపాటు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసరమైతే తప్పించి ప్రజలు ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించింది.

- మంగళవారం అర్ధరాత్రి నుంచి తీవ్రత
- కాకినాడ పోర్టు-తుని మధ్య తీరం దాటే అవకాశం
- ఆ సమయంలో గంటకు 100కి.మీ వేగంతో గాలులు
- మూడు రోజులు రెడ్ అలెర్ట్ - కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు
- పోర్టులో ఐదో నెంబర్ ప్రమాద హెచ్చరిక
- తూర్పున స్కూళ్లకు సోమ, మంగళవారం సెలవులు
- ఆది, సోమవారాలు కాకినాడ బీచ్ మూసివేత

ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం సాయంత్రం నాటికి గంటకు ఏడు కిలో మీటర్ల వేగంతో వాయుగుండంగా కదులుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయు గుండంగా, సోమవారం నాటికి తుఫాన్‌గా, మంగళవారం నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. ప్రస్తుతానికి పోర్టుబ్లెయిర్‌కు 440 కి.మీ, విశాఖకు 970 కి.మీ, కాకినాడకు 900 కిలోమీటర్ల దూరంలో కొనసాగుతోంది. మంగళవారం అర్ధరాత్రికి తీవ్ర తుఫాన్ కాకినాడలో తీరం దాటనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయనున్నాయి. అటు తుఫాన్ తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 20 సెంటీ మీటర్ల మేర కుంభవృష్టిగా వానలు కురవనున్నాయి.



కాకినాడ, కోనసీమల్లో హైఅలెర్ట్

కాకినాడ,కోనసీమ,తూర్పుగోదావరి జిల్లాల్లో కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాలు, జలవనరులశాఖ, ట్రాన్స్‌కో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశాయి. మూడు జిల్లాల కలెక్టర్లు తుఫాన్ సన్నాహక చర్యలపై వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. తూర్పుగోదావరి జిల్లాలో సోమ, మంగళవారాలు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. కాకినాడ బీచ్‌ను ఆదివారం, సోమవారాలు మూసివేస్తామని ప్రకటించారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని తీర ప్రాంత మండలాల్లో హైఅలర్ట్ జారీ చేశారు. ఈ రెండు జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు ప్రకటించాల్సి ఉంది. పెనుగాలుల ధాటికి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏలేరు రిజర్వాయరులో ముందుగానే నీటిని విడుదల చేయడంతో పరీవాహక ప్రాంతాలను అప్రమత్తం చేశారు. తుఫాన్ తీరం దాటే సమయంలో కాకినాడ జిల్లాపై తీవ్ర ప్రభావం పడనుంది. భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో గ్రామ స్థాయిలో సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కార్యాచరణ రూపొందించారు. తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యావసరాలను తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. టెలికం ఆపరేటర్లు సమన్వయంతో మొబైల్ టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ సేవల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలకు ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండండి : పవన్

పిఠాపురం,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఇతర అధి కారులతో శనివారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లాలో సముద్ర తీరప్రాంతం ఉన్న పిఠాపురం, తుని, కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాలతోపాటు తాళ్లరేవు మండలంపై తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండబోతోందని వాతావరణశాఖ వేసిన అంచనాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. తీరం వెంబడి ఉన్న గ్రామాల్లోని ప్రజలు సురక్షితం గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు తదితర నియోజకవర్గాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.

వస్తానన్న పవన్.. వద్దన్న కలెక్టర్



తుఫాన్ ప్రభావం సమాచారంతో కాకినాడ జిల్లాకు వస్తానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలెక్టర్ షాన్‌మోహన్‌కు తెలియజేశారు. అధికారయంత్రాంగం అంతా తుఫాన్ ఎదుర్కొనే సన్నద్ధతలో ఉందని.. ఇటువంటి సమయంలో జిల్లా పర్యటన వద్దని కలెక్టర్ సూచించారు. దీంతో పవన్ తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు.

థాయ్‌లాండ్ పేరు పెడితే ఇంతే..

1992 నుంచి ఇప్పటివరకు కాకినాడలో నాలుగు తుఫాన్లు తీరం దాటాయి. 1992లో నవంబరు 6న కాకినాడ వద్ద తుఫాన్ తీరం దాటిన సమయంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో భారీ నష్టం సంభవించింది. 1996 నవంబరు 6న కాకినాడలో తుఫాన్ తీరం దాటిన సమయంలో భారీ గాలులు తీవ్ర నష్టం తెచ్చిపెట్టాయి. 2000లో తుఫాన్లకు పేర్లు పెట్టడం అమల్లోకి వచ్చింది. 2018 డిసెంబర్ 13 నుంచి 18 మధ్య పెథాయ్ తుఫాన్ కాకినాడ-యానాం మధ్యలో తీరం దాటింది. ఈ తుఫాన్‌కు అప్పట్లో థాయ్‌లాండ్ పేరు సూచించింది. ఆ తర్వాత 2020 అక్టోబరు 13న కాకినాడలో ఓ మోస్తరు తుఫాన్ తీరం దాటింది. మళ్లీ ఇప్పుడు తీవ్ర తుఫాను ఏడేళ్ల తర్వాత కాకినాడలో తీరం దాటే అవకాశం ఉంది. ఈ తుఫాన్‌కు మొంథాగా థాయ్‌లాండ్ దేశం నామకరణం చేసింది. థాయ్‌భాషలో మొంథా అంటే సువాసన వెదజల్లే పుష్పం. ఒకరకంగా చెప్పాలంటే థాయ్‌లాండ్ తుఫాన్లకు పేర్లు పెడితే కాకినాడకు మూడినట్టేనన్న చర్చ జరుగుతోంది. గతంలో పెథాయ్ తుఫాన్ కాకినాడలో తీరం దాటిన సమయంలో గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల మధ్య వేగంతో గాలులు వీచాయి. అత్యధికంగా తాళ్లరేవు మండలంలో 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నౌకలన్నీ సముద్రంలోకే...

తుఫాన్ కాకినాడ పోర్టు- తుని సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తుండడంతో కాకినాడ యాంకరేజ్, డీప్ వాటర్ పోర్టులు అప్రమత్తమయ్యాయి. సోమవారం నుంచి మూడు రోజులు అన్ని కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం డీప్‌వాటర్ పోర్టులో 19, యాంకరేజ్‌పోర్టులో ఆరు నౌకలు కార్గో కోసం లంగరు వేశాయి. వీటిని సోమవారం మధ్యాహ్నం తీరం నుంచి 150 నాటికల్ మైళ్ల దూరానికి తరలించనున్నారు. పోర్టులో సోమవారం నుంచి ఐదో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేయనున్నారు. గడచిన ఏడేళ్లలో ఇదే తొలిసారి అని అధికారులు వివరించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

నేటి నుంచి ఈనెల 30వ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలి

అప్పటివరకు ఉద్యోగులకు సెలవులు రద్దు

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో జిల్లాలో అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను ప్రభావం వల్ల ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయలేమన్నారు. జిల్లాలో ఉన్న ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా విధులలో ఉండాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు గ్రామస్థాయి ఉద్యోగులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. తుఫాను సంభవించినప్పుడు జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు హెడ్‌క్వార్టర్‌లో అధికారులకు తెలియజేయాలన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని అది 24 గంటలూ పనిచేస్తుందన్నారు. నియోజకవర్గ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు తుఫానుని పరిస్థితులను పరిశీలించి ఎప్పటికప్పుడు తనకు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

నిండుకుండలా ఏలేరు జలాశయం

7

వరద నీరు విడుదల చేసే అవకాశం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏలేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగితే మూడు వేల క్యూసెక్కుల నుంచి పది వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శనివారం ఆయన కాకినాడ నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనేపథ్యంలో ఏ విధమైన ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరతుండడంతో ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఏలేరు, సుద్దవాగు ప్రభావిత మండలాలలో తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పిఠాపురం. యు.కొత్తపల్లి తహసీల్దార్లు, వీఆర్వోలు ఏమైనా సంఘటనలు జరిగితే వెంటనే తెలియజేయాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైనచోట రిలీఫ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కూలిపోయేందుకు అవకాశం ఉన్న ఇంట్లో ఉంటున్న ప్రజలను తక్షణమే ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు గట్లు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలను ముందుగానే పునరావాస కేంద్రాలకు, ఆసుపత్రులకు తరలించాలన్నారు. అలాగే భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కాలనీల్లోకి నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

వరద ముంపు నుంచి పిఠాపురాన్ని కాపాడాలి

కలెక్టర్‌కు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ వినతిపత్రం

పిఠాపురం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి):అధికవర్షాలు, తుఫాన్ల సమయాల్లో ఏలేరు రిజర్వాయర్ నుంచి వరద నీటి జలాలు విడుదలకు సంబంధించి గతంలో అమలులో ఉన్న విధానాలననుసరించి పిఠాపురం నియోజకవర్గాన్ని ముంపు నుంచి కాపాడాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ కోరారు. ఈమేరకు ఆయన శనివారం జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2014లో అమలుపరిచిన విధంగా పిఠాపురం ప్రాంతానికి మూడు వంతుల్లో రెండు వంతులు, పెద్దాపురం ప్రాంతానికి ఒక వంతు వరద నీటిని మళ్లించాలన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో వరద నీటిని పూర్తిగా పిఠాపురం వైపు వదలడం వల్ల సుమారు 60 వేల ఎకరాల్లో పంటను రైతులు నష్టపోయారని, పంటకాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఎస్.తిమ్మాపురం రెగ్యులేటర్ నుంచి కాండ్రకోట దబ్బకాలువ ద్వారా పెద్దాపురం ఏరులోకి వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల వరద నీరు వేగంగా సముద్రంలోకి వెళ్లి నష్ట తీవ్రత తగ్గుతుందని తెలిపారు. అలాగే వరదనీటి విడుదలలో ఇరిగేషన్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి ప్రకాష్, నాయకులు పిల్లి చిన్నా, నామా దొరబాబు పాల్గొన్నారు.



నేటికీ.. అవిశ్రాంతంగా!

విశ్రాంత ఉద్యోగుల స్నేహహస్తం

- పెన్షనర్ల సేవలో ఒక సంఘం
- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- 50 ఏళ్లుగా పెద్దలకు అండగా..
- నేడు గోల్డెన్ జూబ్లీ వేడుక
- ఎంప్లాయీస్ అసోసియేషన్ ముస్తాబు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు 62 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుని విశ్రాంతిలోకి వెళ్లిపోతారు.. అటువంటి ఉద్యోగుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతుందో అసోసియేషన్.. ఒకటి రెండు కాదు.. ఏకంగా 50 ఏళ్లుగా.. అదే కాకినాడఅర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లా యీస్ అసోసియేషన్. ప్రభుత్వ సేవల నుంచి రిటైరైన వేలాది మంది ఉద్యోగులు తమ జీవితంలోని రెండో ఇన్నింగ్స్‌ను ప్రశాంతంగా, గౌరవంగా గడిపేలా చేస్తుందీ సంస్థ. పెన్షనర్ల కుటుంబాల్లో ఆరోగ్యం, చట్టపరమైన సలహాలు, సామాజిక భద్రత వంటి కార్యక్రమాలు అదనపు బలాన్ని ఇస్తున్నాయి. విశ్రాంత ఉద్యోగుల సమస్య ఏదైనా ఉందంటే అక్కడ వాలిపోతారు. పరిష్కారం దిశగా చర్యలు చేపడతారు. పండుగలు, ప్రత్యేక దినోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సభ్యుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. రిటైర్మెంట్ తర్వాత కూడా సమాజానికి అండగా నిలిచేలా స్ఫూర్తినిచ్చే వేదికగా ఈ సంఘం ఎదిగింది. సభ్యుల హక్కుల సాధనకు ఈ సంఘం పోరాడుతోంది. పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఆరోగ్య శిబిరాలు న్యాయ సలహా కేంద్రాలు, పింఛన్ చెల్లింపుల్లో ఇబ్బందుల పరిష్కారం పండుగలు, జాతీయ దినోత్సవాలు, సాంస్కృతిక వేడుకలు, చివరి ప్రయాణంలో కూడా తోడుగా సేవలు, సమాచార కేంద్రంగా కూడా పనిచేస్తారు.

నేడు గోల్డెన్ జూబ్లీ

కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో 1975లో చిన్న కార్యాలయం ప్రారంభించి 50 వసంతాలు పూర్తి చేసుకుని రాష్ట్రం గుర్తించే ఒక కార్పొరేట్ స్థాయి సంస్థగా, అందరికీ ఆదర్శంగా నిలిచింది. అందుకే రాష్ట్ర నలుమూలల నుంచి రాజకీయ, రాజకీయేతర నాయకుల మధ్య నేడు ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా..



అటవీశాఖలో పనిచేస్తూ 2007లో రిటైర్డ్ అయ్యా. ఉద్యోగం చేసే విశ్రాంతి ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యల కోసం ఆలోచించా. అందుకే నా వంతుగా పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడిగా వారి సమస్యల కోసం నాయకులతో, అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటా. **కె.పద్మనాభం, జిల్లా సంఘం అధ్యక్షుడు.**

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా..



ఉపాధ్యాయుడిగా పనిచేసి 2001లో రిటైర్డ్ అయ్యాను. పెన్షనర్స్ జిల్లా సంఘం అధ్యక్షుడిగా రిటైర్డు అయిన ఉద్యో గుల కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్నాం. ఈ గుర్తింపుతోనే రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా నాకు బాధ్యతలు అప్పగించారు.గోల్డెన్ జూబ్లీని ఘనంగా నిర్వహిస్తాం.

పీఎస్ఎస్ఎన్‌పీ. శాస్త్రి, రాష్ట్ర సంఘ అధ్యక్షుడు

ప్రైవేటు బస్సులపై కొరడా

జిల్లాలో రవాణాశాఖ విస్తృత తనిఖీలు.. కాకినాడ జిల్లాలో 23 బస్సులపై కేసులు

కాకినాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం నేపథ్యంలో కాకినాడ జిల్లా రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రవాణాశాఖ ఉపకమిషనర్ శ్రీధర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రైవేటు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. కాకినాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే అన్ని బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు కూడా ఈ తనిఖీలు జరిగాయి. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 23 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు, అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు లేనివి, ప్యాసింజర్ లిస్టులు సక్రమంగా లేనివి, ఇతర ఉల్లంఘనలను రవాణాశాఖ అధికారులు గుర్తించారు. రవాణాశాఖాధికారుల తనిఖీ నేపథ్యంలో పలు ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు బస్సులను తిప్పడం ఆపేశాయి. కాకినాడ పీఆర్ కాలేజీ రోడ్డు నుంచి ప్రారంభమైన బస్సులను జెడ్పీ సెంటర్లో నిలిపి ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేశారు.

ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యం

తూతూమంత్రంగా తనిఖీలు

సామర్లకోట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. చాలామంది ప్రైవేట్ ట్రావెల్స్ కాంట్రాక్ట్ క్యారియర్లను స్టేజ్ క్యారియర్లుగా మార్చి నడుపుతున్నారు. అదే సమయంలో బస్సుల్లో కనీస సౌకర్యాలు లేకుండా ఇష్టానుసారంగా టిక్కెట్ల ధరలు పెంచి జనం జేబులు ఖాళీచేస్తున్నారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు కూడా మామూళ్ల కారణంగా తూతూమంత్రంగా చేస్తున్నారు. కాగా శనివారం సామర్లకోట శివారు ముత్యాలమ్మ విగ్రహం సమీపాన హైదరాబాద్ నుంచి కాకినాడ వస్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు తనిఖీచేసి జరిమానా విధించారు.

ఎందుకింత నిర్లక్ష్యం

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ అసహనం
- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- కూడళ్ల వద్ద భక్తులకు సూచీబోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశం



నూతన మెట్లమార్గాన్ని పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాసం సందర్భంగా భక్తులకు కల్పించిన ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ శనివారం స్వీయ పర్యవేక్షణ చేశారు. భక్తులు స్వామి సన్నిధికి విచ్చేసే స్వాగత ద్వారం వద్దనే నిర్వహణ ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ముందుగా కళాశాల మైదానాన్ని పరిశీలించారు. కళాశాల ఆనుకుని ఉన్న క్రీడాస్థలం కోసం ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతో పాటుగా అక్కడక్కడా ఉన్న గోతులను పూడ్చాలన్నారు. టోల్ గేట్ వద్ద శానిటేషన్ సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నూతన మెట్లమార్గాన్ని పరిశీలించారు. ఇంకా అందుబాటులోకి తీసుకురాకపోవడానికి కారణమేంటని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామకృష్ణను ప్రశ్నించారు. మరో వారంరోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రక్షణగోడను రాతితో నిర్మించాలని, మెట్లమార్గంలో కేబుల్ విద్యుత్ కాకుండా సోలార్‌కు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. సీఆర్వో కార్యాలయం పరిశీలించి గదుల ఖాళీల వివరాలు డిస్‌ప్లేలో ఉండేలా చూడాలని, దీనిని రోజు జీపీఎస్ ఫోటో తీసి ఈవో ఫోన్ కు పంపించాలన్నారు. భక్తులకు ఎక్కడా సూచీబోర్డులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అసం తృప్తి వ్యక్తం చేశారు. తాను స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు.

శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం..

అనంతరం ఆయన వినాయక అతిథిగృహంలో ఈవో, చైర్మన్, ఏఈవోతో సమావేశమయ్యారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేవిధంగా చూడాలని వసతిగదులు, అందులో మౌలికవసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విష్ణుసదన్ హాల్స్ పరిశీలించి శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల విశ్రాంతి తీసుకునే హాల్స్‌లో వివాహ డెకరేషన్ మండపాలు ఉండడంతో వివాహం అనంతరం తొలగించేలా చూడాలన్నారు. భక్తుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్డులో వ్రతం టిక్కెట్లు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటుచేసిన ప్రదేశం సరిగా లేదని దానిని చివరకు మార్చాలని రద్దీసమయంలో హోల్డింగ్ పాయింట్ల వద్ద నిండిన జనం ఈ విశ్రాంత షెడ్డుకు వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూం వద్ద సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలతో పాటుగా మిగిలిన వాటిలో కూడా భాగస్వామ్యం కావాలన్నారు. శని,ఆది,సోమవారాలతో పాటుగా ఏకాదశి, దశమి, కార్తీకపౌర్ణమి రోజుల్లో ఈవో పశ్చిమరాజగోపురం వద్దనే ఉండి పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. తప్పనిసరిగా రోప్ ఉండాలని దీనిద్వారా తోపులాటలు నివారించవచ్చన్నారు. వాకీటాకీల ద్వారా ఎప్పటికప్పుడు మోనటరింగ్ చేసుకోవాలన్నారు. ప్రధానంగా కార్తీకపౌర్ణమి రోజు చాలా కీలకమైనదని.. ఒకపక్క స్వామి సన్నిధికి వ్రతం, దర్శనం కోసం వచ్చేవారు, మరోపక్క గిరిప్రదక్షిణకు వచ్చేవారి సంఖ్య సుమారు 2లక్షలమంది ఉంటుందని దానికణుగుణంగా వ్యవహరించాలన్నారు. గిరిప్రదక్షణ సమయంలో సత్యరథం తొలిపావంచా వద్ద ఎక్కువసేపు నిలపకుండా 15 నిమిషాల్లో కదపాలన్నారు. గిరిప్రదక్షిణ రోడ్డులో చిన్నచిన్న రాళ్లు ఉంటున్నాయని, అక్కడ రోలింగ్ చేయాలని అదేవిధంగా సుమారు 50 అదనపు టాయిలెట్లు ఉండేలా చూడాలన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, అధికారులున్నారు

ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా..



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ

కాకినాడలో ఓపెన్ హౌస్ కార్యక్రమం

విద్యార్థులకు పలు అంశాలు వివరించిన ఎస్పీ బిందుమాధవ్





గన్స్ ఉపయోగాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖకు సంబంధించిన సాంకేతికత పరికరాలు, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ ఆయుధాలు, పోలీస్ జాగిలాల పని తీరు, డ్రోన్ల వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీ వార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం, బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్ స్పీడ్ గన్, నేర పరిశోధనలో, బాంబులను గుర్తించడంలో పోలీస్ జాగిలాల పని తీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఎస్పీ ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ నెల 27న కూడా నిర్వహిస్తామని విద్యార్థులు, ప్రజలు వచ్చి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించి అవగాహన పెంచుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరి, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నావల్ ఉన్నతాధికారుల పూజలు

సత్యదేవుడిని శనివారం ఈస్ట్రన్ నావెల్ కమాండ్ ఉన్నతాధికారులు బి.శివకుమార్ కటుంబసభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆగమ పాఠశాల ఆహార పదార్థాలందజేశారు.



దర్శనం అనంతరం నావల్ అధికారులు

డ్వాక్రా సొమ్ముల దుర్వినియోగం..
బ్యాంకింగ్ కరస్పాండెంట్‌పై ఫిర్యాదు

కరప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం కూరాడ-1,2, చిన్న మామిడాడలకు చెందిన 74 డ్వాక్రా సంఘ సభ్యులకు చెందిన రూ.99,86,440 పొదుపు, బ్యాంకులోను రుణం సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన బ్యాంకింగ్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతిపై క్రిమినల్ కేసు నమోదు చేసి రికవరీ చేయాలని కోరుతూ శనివారం డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.ఎం.జిలానీ కరప ఎస్ఐ తోట సునీతకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘ సభ్యులు ఇచ్చిన పొదుపు, లోనుసొమ్మును బ్యాంకులకు చెల్లించకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పత్రికల్లో కథనాలు,సభ్యుల ఫిర్యాదుతో విచారణ చేయడం జరిగిందని, ఈ విచారణ నివేదిక రిపోర్టు అక్టోబరు 10న ఉన్నతాధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రియభారతి తల్లి కూరాడ-2 యానిమేటర్ (వీవోఏ)గా పని చేస్తుందన్నారు. ఆమె కూడా డ్వాక్రా సంఘ సభ్యుల డబ్బులు బ్యాంకుకి జమచేయకపోవడం, కుమార్తె ప్రియభారతికి సహకరించిందన్నారు. ఆమె చేసిన అక్రమాలు, అవకతవకలు కూరాడ -వీవోఏ ఆలపాటి బేబీ, చినమామిడాడ వీవోఏ ఆచంట మాధవికు తెలిసినా చెప్పకుండా సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. కూరాడ-1లో 28 సంఘాలకు చెందిన పొదుపు,రుణం సొమ్ము రూ. 31,47,300, కూరాడ-2లో 32 సంఘాల రూ. 57,53,240, చిన మామిడాడకు చెందిన 14 సంఘాలకు 10,85,900 వెరసి మొత్తంగా రూ. 99,86,440 సొంతానికి వాడేసుకున్నట్లు విచారణలో నిర్ధారణ చేయడం జరిగిందని తెలిపారు.

నిండుకుండలా...

ఏలేరు జలాశయం

దిగువ ప్రాంతాలకు 3000 క్యూసెక్కుల నీరు విడుదల



ఏలేరు జలాశయం

ఏలేశ్వరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు నుంచి 3000 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరిగాయి. మరో 4 రోజుల పాటు వర్షాలు పడే సూచనలతో ఎగువ ప్రాతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరి కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఏలేరు ప్రాజెక్టులో శనివారం 86.56 మీటర్లకుగాను 85.57 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.10 టీఎంసీలు నీటి నిల్వలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కులు నీటిని, దిగువ ప్రాంతాలకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో పిఠాపురం యువకుడికి కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన సురేష్‌కుమార్

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం బొజ్జా వారి తోటకు చెందిన కేతినీడి సురేష్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు. ముంబైలోని జస్వంత్‌రావు చౌహాన్ సెంటర్‌లో వరల్డ్ నేచురల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన పోటీల్లో సురేష్‌కుమార్ పాల్గొన్నాడు. ఓపెన్ ఫిజిక్ కేటగిరీలో జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. పలువురు అభినందించారు.

నవంబరు 10, 11 తేదీల్లో
'నన్నయ' అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పురుషుల, మహిళల చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు నవంబరు 10,11 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. అతిపెద్ద క్రీడా కార్యక్రమమైన దీనిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్ట్స్ కళాశాల వ్యాయామ అధ్యాపకులకు తెలిపారు. అథ్లెటిక్స్‌లో మొత్తం 26 క్రీడాపోటీలు ఉంటాయని, సమష్టిగా కృషి చేసి పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రామచంద్రరావు ఆర్‌కే మాట్లాడుతూ కళాశాలలోని అన్ని విభాగాలు, పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో అథ్లెటిక్ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. నన్నయ వర్సిటీ పరిధిలోని క్రీడాకారులంతా పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎంపీఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యనిర్వాహక సభ్యులు ఎం.ప్రసాద్, పీవీవీ లక్ష్మి, టి.విజయదుర్గ ఉన్నారు.

నేడు 'కవిసంధ్య' దశాబ్ది ఉత్సవం

- యానాంలో సాహితీ పురస్కారాల ప్రదానం
- హాజరుకానున్న మల్లాడి, మండలి బుద్ధప్రసాద్
- పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు శిఖామణి జీవన సాఫల్య పురస్కారం
- యువ పురస్కారం, పది మందికి ప్రతిభా పురస్కారాలు

యానాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వార్తలు, విశేషాలు, విశ్లేషణలకు పత్రికా మాధ్యమమే ప్రధాన స్రవంతి. సామాజిక చైతన్యానికి కరదీపికలుగా ఈనాటికీ పత్రికలే వెలుగొందుతున్నాయి. సాహిత్య సంపదకూ పత్రికలే పట్టుగొమ్మలయ్యాయి. ఇక కేవలం సాహిత్యమే ప్రధానంగా నడిచే పత్రికలు తెలుగునాట అనేకం ఉన్నాయి. కొత్త కవులకు, రచయితలకు ఇవే తొలి పరిచయ వేదికలు.. పదేళ్ల కిందట ఈ సాహిత్య ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే క్రమంలో 'కవిసంధ్య' కూడా సాహితీ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ప్రముఖ కవి శిఖామణి ఈ కవిసంధ్యకు సంపాదకుడు. కవిత్వం, దానికి అనుబంధంగా కవిత్వపు ధోరణులు, చర్చ, విమర్శలకు మాత్రమే ఇది వేదిక. సాహిత్యంలోనే అనేక ప్రక్రియలను మిళితంగా చేసుకుని పత్రిక నిర్వహించడం వేరు. ఇలా నిర్దేశిత పరిమితులతో ఒకే అంశానికి పరిమితమై ముందుకుసాగడమంటే కత్తిమీద సామే. అయినా సరే, అన్ని సవాళ్లను దాటుకుని పది వసంతాలను కవిసంధ్య పూర్తిచేసుకుని కేంద్ర స్థానం యానాంలో వేడుకను జరుపుకుంటోంది. కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాంలో ప్రతీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభతోపాటు ఈసారి కవిసంధ్య దశాబ్ది ఉత్సవం ఆదివారం జరగనుంది. యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణమండపంలో ఈ సభ ఏర్పాటు చేశారు. కవిసంధ్య రథసారథి, కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరవుతారు. శిఖామణి జీవన సాఫల్య పురస్కారం-2025ను ప్రముఖ కవి, రచయిత, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, యువ పురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబు స్వీకరించనున్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలతోపాటు పత్రికారంగానికి సంబంధించి మొత్తం పది మందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందజేస్తారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఎమ్మెల్యే, తెలుగుభాషా సంస్కృతుల ప్రేమికుడు మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ పద్యకవి ఆజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రముఖకవి రచయిత దాట్ల దేవదానంరాజు, ప్రముఖ సాహితీవేత్తలు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, బొల్లోజుబాబా, కుంచే నాగసత్యనారాయణ, సీహెచ్ రాం, డాక్టర్ గూటం స్వామి తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కవిసంధ్య- ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరగనుంది.

కొవ్వూరులో వారాహి అమ్మవారి ఆభరణాల తనిఖీ

4.3 మిల్లీ గ్రాముల బంగారం, 3.5 కిలోల వెండి ఉన్నట్టు గుర్తింపు



ఆభరణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కాకినాడ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయంలో ఉన్న ఆభరణాలను దేవదాయ, ధర్మదాయశాఖ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల జ్యూయలరీ తనిఖీ అధికారి విళ్లపల్లంరాజు శనివారం పరిశీలించారు. ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్‌సౌజన్య వారాహి అమ్మవారి ఆభరణాలను అధికారికి అందజేయగా కూటమి నాయకులు కరెడ్ల గోవిందు, రవి, గ్రామ పెద్దల సమక్షంలో తనిఖీ నిర్వహించారు. మొత్తం 4.3 మిల్లీ గ్రాముల బంగారం, 3.5 కిలోల వెండి ఉన్నట్టు అధికారులు గుర్తించి వాటి వివరాలను అధికారికంగా రిజిస్టర్‌లో నమోదచేశారు. జేవీవో మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 కంటే ముందు ఎవరైనా ఆలయానికి ఆభరణాలు ఇచ్చి ఉంటే వాటి వివరాలను తమకు తెలపాలని, వాటిని మాత్రమే దేవదాయ శాఖ రికార్డులో నమోదు చేసి అమ్మ వారికి అలంకరించడం జరుగుతుందని సూచించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను పరిశీలించి దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారమందిస్తానని తెలిపారు. ఆభరణాల తనిఖీలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



భీమన్న (ఫైల్)

ద్రాక్షారామ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఆలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రోజు వారీ కూలీకి గార్డెనర్‌గా ద్రాక్షారామానికి చెందిన దొంగల భీమశంకరం (భీమన్న) (46) పనిచేస్తున్నాడు. భీమశంకరుడు, అతడి కుమారుడు గత కొంతకాలంగా ఆలయంలో తోట పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఉత్తర గోపురం దగ్గర గడ్డిని యంత్రంతో కట్ చేస్తూ బోర్లా పడిపోయి ఉన్నాడు. పక్కన కటింగ్ మిషన్ తిరుగుతూనే ఉంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఈవో, సిబ్బంది చూసి పక్కనే ఉన్న ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

ఆలయానికి సంప్రోక్షణ

ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘటన జరగడంతో ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం నుంచి మూసివేసి సంప్రోక్షణ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి తిరిగి స్వామివారి దర్శనం భక్తులకు కలిగించారు.

నకిలీ పోలీసు అరెస్ట్

బంగారు ఉంగరాలు, గొలుసు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ బాలాజీ

నిడదవోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు వేషధారణలో ప్రజలను మోసగిస్తూ నేరాలకు పాల్పడుతున్న విశాఖపట్టణానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో జరిగింది. ఎస్ఐ బాలాజీ సుందరరావు తెలిపిన వివరాల ప్రకారం... నిడదవోలు మండలం శంకరాపురంలో ఈనెల 22న ఒక ఇంట్లో చోరీ చేసి 2 కాసుల బంగారం గొలుసు, ఒక బంగారు ఉంగరం దొంగిలించుకుపోయాడని కాయల మంగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు నిందితుడు విశాఖపట్టణం సీతమ్మధారకు చెందిన ఆదిరెడ్డి అప్పారావును అరెస్టు చేసి విచారించగా అతడిపై 14 కేసులు ఉన్నట్లు వెల్లడైందన్నారు. అతడి నుంచి 3 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీస్ అని చెప్పి ప్రజలను మోస గిస్తుంటాడని తెలిసిందన్నారు. 14 పాత కేసులతో పాటు కోరంగి పోలీస్ స్టేషన్, గోకవరం పోలీస్ స్టేషన్, గండేపల్లి పోలీస్ స్టేషన్, కరప పోలీస్ స్టేషన్, రాజమండి టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 6 నేరాలు చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. అతడిని కోర్టుకు పంపుతామన్నారు. సమావేశంలో ఎస్ఐ జె.కల్పన సిబ్బంది ఉన్నారు.

'స్పందన'లో రూ.1.44 లక్షలు మాయం

ఆరుగురిపై కేసు నమోదు

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎర్రవంతెన వద్ద ఉన్న స్పందన ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో రూ.1.44లక్షలు నగదు మాయం చేసిన ఆరుగురిపై శనివారం అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేశారు. స్పందన ఫైనాన్స్ కార్పొరేషన్‌లో లోన్ రికవరీ అధికారులుగా పనిచేస్తున్న వారి బండారం ఆడిట్‌లో బయటపడింది. స్పందన మేనేజర్ పలివెల వినోద్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోన్ రికవరీ అధికారులుగా పనిచేస్తున్న కాసా కార్తీక్, గెడ్డం కుమార్, దాసరి విష్ణుప్రకాష్, కోసూరి గోపి, కోసూరి ప్రేమ్‌కుమార్, చిన్నారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు పేర్కొన్నారు.

కోర్టులో అగ్ని ప్రమాదం

రూ. 4 లక్షల ఆస్తి నష్టం



సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దగ్ధమైన సామగ్రి

కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం రోజు మాదిరిగానే కోర్టు తలుపులు తీసి చూడగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్మేసి ఉండడాన్ని సిబ్బంది గమనించి అధికారులకు తెలియజేశారు. కాగా గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ లీకయ్యి వర్షపు నీరు కోర్టు హాలులో పడడంతో కరెంట్ షార్ట్ సర్క్యూట్ అయి ఉండవచ్చని సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తెలిపారు. న్యాయమూర్తి ఆశీనులయ్యే ప్రాంతంలోనే షార్ట్ సర్క్యూట్ సంభవించి కంప్యూటర్, ప్రింటర్‌టేబుల్, కుర్చీల నుంచి 3 ఏసీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో 4 ఏసీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అలాగే కోర్టు హాలు స్లాబ్, గచ్చు కూడా ధ్వంసమైంది. వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ఘటనా స్థలిని పరిశీలించి అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సమీపంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఎగ్ ట్రేలు భారీగా కింద పడి వేలాదిగా కోడిగుడ్లు చితికిపోయాయి. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో పోలీసులు క్యాబిన్ నుంచి బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు.



రోడ్డుపై వ్యాన్ నుంచి పడి చితికిన కోడిగుడ్లు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మహాసంస్థానంలో విశేష పూజలు

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శనివారంవిశేషపూజలు నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభునికి అభిషేకం, పుష్ప, బిల్వపూజలు జరిగాయి. దత్తహోమంలో భక్తులు పాల్గొన్నారు. అనం తరం శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం చేశారు.

మొంథా తుఫాన్‌తో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ ఈనెల 28న కాకినాడ సమీపతీరాన్ని తాకే అవకాశముందని భారత వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కేటీ సుధాకర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో తుఫాన్‌కు సంబంధించిన ముందస్తు సన్నాహాలు, అత్యవసర చర్యలపై ఆయన వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ మొంథా తుఫాను ఈనెల 27వతేదీ సాయంత్రం లేదా రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశముంది. ఆది వారం నుంచే ప్రభావం కనిపించే అవకాశమున్నందున ప్రతీ విభాగం సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే పల్లపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో 14 తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వాటిలో తాగునీరు, పాలు, కూరగాయలు, కొవ్వొత్తులు, జనరేటర్లు, డీజిల్ తదితర వాటిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిలో నివశించే ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. జేసీబీలు, బ్లేడ్ ట్రాక్టర్లు, తాగునీటి ట్యాంకర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతీ డివిజన్‌లో కనీసం ఒక పునరావాస కేంద్రం ఏర్పాటుచేయాలని ఆయన పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో చెట్లు కూలి రవాణాకు ఆటంకం కలిగితే వెంటనే చర్యలు తీసుకుని రహదారులను పునరుద్ధరించాలన్నారు. తుఫాన్ సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఈ పి.వెంకటరావు, అగ్నిమాపకాధికారి సుబ్బారావు, అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్విచరణ్, డీసీపీ కృష్ణారావు, ఉద్యానవన అధికారి సిరిల్, టీపీఆర్వో శైలజ, కార్పొరేషన్ మేనేజర్ సీతారాం, శానిటేషన్, అటవీశాఖ, ఏఈలు, డీఈలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవోలు

పిఠాపురం(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ఈనెల 28వ తేదీ సాయంత్రం లేదా రాత్రి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నందున తీర ప్రాంతమైన ఉప్పాడ కొత్తపల్లి మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబులు ఆదేశించారు. పిఠాపురంలోని పాడా కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో వారు తుఫాన్ సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచే తుఫాన్ ప్రభావం కనిపిస్తుందని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని సూచించారు. నిత్యావసర వస్తువులు, పాలు, కొవ్వొత్తులు ఇతర అత్యవసర సామాగ్రిని సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలోని పాడా కార్యాలయంలో జరిగిన సమావేశంలో సూచనలు ఇస్తున్న పాడా పీడీ చైత్రవర్షిణి, ఆర్డీవో మల్లిబాబు

సమీక్షా సమావేశంలో కమిషనర్ సుధాకర్

సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దు

సర్పవరంజంక్షన్(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రమాదం పొంచి ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు ఎవరూ చేపల వేటలకు వెళ్లవద్దని వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. శనివారం కాకినాడరూరల్ మండలం వాకల పూడి, సూర్యారావుపేట, నేమాం శివారు కొండేలపేట గ్రామాల్లో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరాన్ని దాటనుందన్న వాతావరణశాఖ సూచనలతో తీవ్ర గాలులతో పాటూ విస్తారంగా వర్షాలు కురుస్తాయన్నారు. ఆదివారం నుంచి ఈనెలాఖరు వరకు ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా సముద్రంలో చేపలవేట కోసం మత్స్యకారులు వెళ్లరాదన్నారు. సముద్రంలో ఉన్న బోట్లు, తెప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, బోట్లులో ఉన్న వలలు, ఇతర పరికరాలను సురక్షిత ప్రాంతంలో భద్రపరచుకోవాలన్నారు. బోట్లు జట్టీలోకట్టినప్పుడు బల మైన లంగర్లు, తాళ్లు కట్టి విలువైన బోట్లను కాపాడుకోవాలని సూచించారు.



కాండ్రకోటలో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవోలు శ్రీరమణి, మల్లిబాబు

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

పెద్దాపురం(ఆంధ్రజ్యోతి): ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కె.శ్రీరమణి పేర్కొన్నారు. మండలంలో ఏలేరు పరివాహక గ్రామాలైన కాండ్రకోట, మర్లావ, కట్టమూరు తదితర గ్రామాల్లో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఇరిగేషన్ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఏలేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగితే ఏలేరు ప్రాజెక్టు నుంచి 3వేల క్యూసెక్కుల నుంచి 10క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశముందని ఏవిధమైన ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్, మండల అధికారులు, తహసీల్దార్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఇరిగేషన్ అధికారులు రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1264 ఎకరాలలో వరి నీట ముంపు

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సామర్లకోట మండలంలో పలు గ్రామాలలో 1,264 ఎకరాలలో వరి పొలాలు నీటముంపులో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 18 గ్రామాలలోనూ 22,685 ఎకరాలలో వరిపంట సాగులో ఉన్నట్లు తెలిపారు. ప్రాథమికంగా పొలాలు నీటముంపులో ఉన్న రైతులు 552మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు ఆర్ఎస్‌కె సిబ్బందితో కలిసి ఎంఏవో ముంపు పొలాలను పరిశీలించారు.



తుఫాన్ సన్నద్ధతపై అధికారులకు సూచనలు ఇస్తున్న మెప్మా పీడీ ప్రియంవద

లోతట్టు ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

గొల్లప్రోలు(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందిపడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, ప్రత్యేకాధికారి ప్రియంవద అధికారులను ఆదేశించారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం అన్నిశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంటకాలువలు, డ్రైన్లల్లో పూడికలు తొలగించాలని సూచించారు. ఎక్కడా ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు. గొల్లప్రోలు తహసీల్దారు రామ్‌కుమార్, ఎంపీడీవో సెలట్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవో కుమార్, ఏఎస్ఐ లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు తొమ్మిదివేల మందికి పైగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేషపూజలు,అభిషేకాలు నిర్వహించారు. రూ.2,34,833 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

ఉధృతంగా సుద్దగడ్డ

● తాటిపర్తి రోడ్డుపై వరద నీరు



వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

గొల్లప్రోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వచ్చి చేరుతున్న నీటితో సుద్దగడ్డ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం స్థానికంగా వర్షాలు కురవనప్పటికి నీటి ప్రవాహం అధికంగానే ఉంది. గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై సుద్దగడ్డ వరద నీరు ప్రవహిస్తుండటంతో నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరద ఉధృతి మరింత అధికమయ్యే అవకాశం ఉందన్న సమాచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పాదగయలో రిజిస్ట్రేషన్‌శాఖ అడిషనల్ ఐజీ పూజలు



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ రవికుమార్ దంపతులకు స్వామి, అమ్మవార్ల చిత్రటాన్ని అందజేస్తున్న ఈవో

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ అడిషనల్ ఐజీ వి.రవికుమార్ దంపతులు శనివారం సందర్శించారు. పాదగయలోకి కుక్కుటేశ్వరస్వామి దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం గురించి వివరించి ఆశీర్వచనాలు అందించారు. అడిషనల్ ఐజీ దంపతులను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట పిఠాపురం, సామర్లకోట సబ్‌రిజిస్ట్రార్‌లు ఎంఎస్ఆర్ఎస్ స్వామి, తోట శ్రీనివాస్, ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లం రాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇనస్పెక్టర్ దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ప్రభుత్వం కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఎంఏలో 50శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపికైన అధ్యాపకులకు గంట బోధనకు రూ.375లు చొప్పు న ఒక నెలకు రూ.27,000లు చెల్లించనున్నట్లు తెలిపారు. ఆశక్తి అర్హతగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 28లోపు కళాశాల కార్యాలయంలో అందివ్వాలన్నారు.

పంచారామాలకు బయలుదేరిన బస్సు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి మొదటి పంచారామాల సర్వీసును ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు శనివారం జెండాఊపి ప్రారంభించారు. ఈ బస్సు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటక్షేత్రాల దర్శనం అనంతరం ఆదివారంరాత్రి 8గంటలకు కాకినాడ ఆర్టీసీ డిపోకు చేరనుంది. అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.ధర్మారావు, వెంకట్‌రాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల జీవితాలలో వెలుగులు

సామర్లకోట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సాయం పేదల జీవితాలలో వెలుగులు వచ్చినట్లేనని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణ టీడీపీ కార్యాలయంలో శనివారం సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలకు చెం దిన 25మందికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయంగా రూ.10,77,347విలువగల చెక్‌లను, ఎల్‌వోసీలను టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజప్ప పంపిణీ చేశారు.

నేడు 'చిగురించే పేజీలు' కవితా సంపుటి ఆవిష్కరణ

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి కాకినాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు సుబ్బయ్య రెసిడెన్సీలో దొండపాటి నాగజ్యోతి శేఖర్ రచించిన చిగురించే పేజీలు కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగుతుందని జ్యోస్యుల కృష్ణబాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయిని నాగజ్యోతి రచించిన రెండవ కవితా సంకలనం చిగురించే పేజీలు అని ప్రముఖ కవి, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు బెల్లంకొండ ప్రసేన్ సంపుటిని ఆవిష్కరిస్తారని తెలిపారు. జ్యోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగే ఈ సభలో గదుల నాగేశ్వరరావు, కట్టా కృష్ణారావు, పద్మజా వాణి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. అద్దేపల్లి ప్రభు, బొల్లోజు బాబా కవితా సంపుటి గురించి మాట్లాడతారు.

ఆసుపత్రి నిర్మాణానికి స్థలం పరిశీలన

పెద్దాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం స్థల పరిశీలన చేశారు. స్థానిక సీహెచ్‌సీకి సమీపంలో ఉన్న సోషల్ ఫారెస్టు(బృందావనం నర్సరీ) స్థలాన్ని పరిశీలించారు. దీనిపై పూర్తి స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరమణి, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాథ్, తదితరులు ఉన్నారు.



నృసింహదేవరకు ఎమ్మెల్యే అభినందన

కాకినాడసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సోదరుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పెట్టిన కేసును కొట్టివేయడంతో నృసింహదేవర విశ్వనాథంను కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. 2019 సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో అవకతవకలకు పాల్పడినట్టు టీడీపీ న్యాయవాద విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నృహింహదేవర విశ్వనాథంతోపాటు మరో ఇద్దరిపై వీరభద్రారెడ్డి కేసు పెట్టారు. ఈకేసు విచారణ తర్వాత మోపిన అభియోగాలు రుజువుకాకపోవడంతో కేసును కోర్టు కొట్టివేసింది. ఈనేపథ్యంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, గ్రంధి బాబ్జి, బచ్చు శేఖర్, రవి, రాజు పాల్గొన్నారు.

మహిత్‌కు నగదు పురస్కారం

జేఎన్టీయూకే, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులు సాధించిన బానోతు మహిత్‌నాయక్‌కు ఐఏఎస్ అధికారిణి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాకి సునీత ప్రశంసాపత్రంతో పాటూ నగదు బహుమతిని చెక్ రూపంలో అందజేశారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎన్నో చట్టాలను రూపొందించిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ 91వ జయంతి సందర్భంగా ఈనెల 22న విజయవాడలో నిర్వహించిన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను సత్కరించిన కార్యక్రమంలో మహిత్‌నాయక్ నగదు పురస్కారాన్ని అందుకున్నారు. మహిత్ తండ్రి కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకేలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఆర్ఎంసీకి ఏసీల వితరణ

జీజీహెచ్(కాకినాడ) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు రైజింగ్ రోవాంజర్స్ - 2020 ఇంటర్న్స్ బ్యాచ్ తరుపున ఒక్కోటి రెండు టన్నుల సామర్థ్యం కలిగిన 10 ఏసీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్‌కు శనివారం అందజేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని డాక్టర్ మనోహర్, డాక్టర్ జగన్, డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ రుచిత, డాక్టర్ తపస్విని, డాక్టర్ యశ్వంత్ తేజలు సమన్వయంతో సమకూర్చిన ఎయిర్ కండీషనర్లను అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కాలువలోపడి వృద్ధుడి మృతి

కొత్తపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కాలువలో పడిన వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఉప్పాడలో చోటుచేసుకొంది. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీనబాద్‌కు చెందిన దయలపల్లి ఆనందరావు అనే ఆంధ్రయ్య(62) శుక్రవారం ఇంటి నుంచి బయలుదేరి ఉప్పాడ వచ్చారు. సాయంత్రం ఆంధ్రయ్య కుమారుడు కృపారావుకు అతని మావయ్య ఫోన్‌చేసి ఆంధ్రయ్య ఉప్పాడలో కాలువలో పడిపోయాడని సమాచారం ఇచ్చాడు. దీంతో కృపారావు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుని కుమా రుడు కృపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలువలో పడి చనిపోయినట్టుగా వాగ్మూలంలో అతని కుమారుడు కృపారావు తెలియజేసి నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

తీరప్రాంతాల్లో ముంపు నివారణకు చర్యలు

కొత్తపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు భారీ వర్షాల కారణంగా ముంపునకు గురవుతున్న తీరప్రాంత గ్రామాల్లో యుద్ధప్రాదిపదికపై చర్యలు చేపట్టినట్లు గోదావరి తూర్పుడెల్టా ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. కొత్తపల్లి మండలం అమీన బాద్‌లో భారీవర్షాల కారణంగా ముంపునకు గురవుతుందన్న సాయి నగర్‌కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వర్షం నీరు ప్రవహిస్తున్న కాలువలో ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయించి గ్రామంలోకి వరదనీరు రాకుండా చర్యలు చేపట్టారు. సర్పంచ్ నక్కా మణికంఠ, రాష్ట్ర మత్స్యకారకార్పొరేషన్ డైరెక్టర్ వంకా కొండబాబు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి చేలు పరిశీలన

తాళ్లరేవు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గతం వారంరోజులుగా భారీ వర్షాల కారణంగా నీటమునిగి నేలకొరిగిన పంటచేలను ఏరువాక కేంద్రం సైంటిస్ట్ శర్మ, వ్యవసాయ శాఖ బృందం పి.మల్లవరం, పోలేకుర్రుల్లో నేలకొరిగిన పంటచేలను శనివారం పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి పూజలు చేస్తున్న మహిళలు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో హిందువులు అతి పవిత్రంగా భావించే నాగుల చవితి వేడుకలను నగరంలో శనివారం వేడుకగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే కలెక్టరేట్ ప్రాంగణంలోని పాముల పుట్టతోపాటు, విక్టోరియా వాటర్ వర్క్స్, బాలాత్రిపుర సుందరి ఆలయం కోనేరు, సినిమా రోడ్డులోని నాగేంద్రస్వామి ఆలయం, సంతచెరువు పార్కులోని పుట్టలతోపాటు పెద్ద శివాలయం, భానుగుడి శివాలయం, జగన్నాధపురం, అన్నమ్మఘాటీ సెంటర్ గోగులమ్మ ఆలయం, రామారావుపేట, గాంధీనగర్, ప్రతాప్‌నగర్, అశోక్‌నగర్, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో పుట్టలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టల వద్ద భక్తులు బాణాసంచా కాల్చి సందడి చేశారు.

పెద్దాపురం(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలో నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పొలాల్లోని పుట్టలవద్దకు వెళ్లి పాలుపోసి, పూజలు చేసి, చిమ్మిలి, చలివిడి, గుడ్లు, పండ్లు వంటివి నైవేద్యాలు సమర్పించారు.

సామర్లకోట, (ఆంధ్రజ్యోతి): సామర్ల పట్టణం, మండలాల్లో శనివారం నాగుల చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాముల పుట్టలలో పాలు, గుడ్లు వేసి పూజలు చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కాకినాడ సిటీ,(ఆంధ్రజ్యోతి): కాకినాడ వెంకటేశ్వరనగర్ న్యూపోర్టు రైల్వేస్టేషన్ ఎదురుగా గల శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి పూజలు ఘనంగా జరిపారు. మాజీ కార్పొరేటర్ వొమ్మి బాలాజీ, ఆలయ ట్రస్టీ వంకాయల సోమేష్, నీలిమ, వాకచర్ల మల్లేశ్వరరావు, సూర్యనారాయణమూర్తి, గాదె శివరామకృష్ణ, బుజ్జి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో శనివారం నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే చేలల్లో నాగుపాము పుట్టలవద్దకు వెళ్లి చవితిని ఘనంగా జరుపుకున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అధికారులతో డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

తుని రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో సాయి నవీన్ ఉన్నారు.

'ఆదిత్య' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఫ్రెష్మాన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్(మాథమాటిక్స్)గా పనిచేస్తున్న కోసూరి భూషణం ఆంధ్రా యూనివర్శిటీ విశాఖ నుంచి డాక్టరేట్ సాధించినట్టు ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ కె.రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలోని కోసూరి భూషణం సమర్పించిన థీసిస్ పాజిటివ్ సిమ్మెట్రిక్ సొల్యూషన్స్ ఆఫ్ బౌండరీ వాల్యూ ప్రాబ్లెమ్స్ అసోసియేటెడ్ విత్ ఇట్రాటివే సిస్టమ్ అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని ఆయన తెలిపారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి సూచన

తొండంగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ సమీపంలో మొంథా తుఫాన్ తీరాన్ని తాకే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి సూచించారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. నిత్యావసర సరుకులు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుంచి వచ్చే సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు. తహశీల్దార్ టి.కాంతారావు, డీటీ వీరేంద్ర, ఆర్ఐ రాజారావు, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి పాల్గొన్నారు.

కోటనందూరు(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా సోమవారం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కారణంగా మండలంలో గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తెలిపారు. సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లు తహశీల్దార్ 9849903886, ఎంపీడీవో 91009 70617, పోలీస్ 9440904834, ఏవో 83310 56601 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

జగ్గంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీతారాంపురం శివారున కోడిపందాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ఎస్ఐ రఘునాధరావు శనివారం సిబ్బందితో దాడులు జరిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

వంతాడ- రౌతుపాలెం రహదారి అభివృద్ధికి కృషి



వంతాడ- రౌతుపాలెం రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

ప్రత్తిపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వంతాడ- రౌతుపాలెం రహదారి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ చెప్పారు. వంతాడ, రౌతుపాలెం రహదారిని శనివారం వారు పరిశీలించారు. అధ్వానంగా మారిన ఈరహదారి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేకు వివరించారు. వారు స్పందిస్తూ రహదారి పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. వంతాడ కొండపై నెలకొన్న సమస్యలను వివరిస్తూ గిరిజనులు వినతి పత్రం అందజేశారు. ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, గోకవరం సర్పంచ్ రామలక్ష్మి, నాగేశ్వరరావు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, నిమ్మల రాంబాబు, చీకట్ల నాని, లొండా లోవరాజు, దేవర రామకృష్ణ యాదవ్, బొండాడ నారాయణుడు, మాజీ సర్పంచ్ రొంగల యమున, కుడే రాజబాబు పాల్గొన్నారు.

జీడిమామిడి రైతులకు శిక్షణ

శంఖవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జీడిమామిడి తోటలకు నవంబర్ నెల నుంచే మందులు పిచికారి చేయాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. శనివారం గౌరంపేట, నెల్లిపూడి గ్రామాల్లో ఉద్యాన అధికారి దివ్య అధ్యక్షతన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మామిడి, జీడిమామిడి చీడపురుగులు నివార ణకు వేపనూనె 1500 పీపీఎం, 3మిల్లీలు కార్బన్‌డైజమ్ ఒక గ్రాము లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. బిందు సేద్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై ఆయిల్‌పామ్ తోటలకు అందిస్తామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ బద్ది మణి రామారావు, ప్రగడ మహేష్, జగదీష్, విజయ్‌కుమార్, వనలక్ష్మి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

శంఖవరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో ఐదు అంతస్తులు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి విద్యనభ్య సిస్తున్న విద్యార్థులు సందర్శించారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ బి.నాగేశ్వరరావు,కాకినాడ ఐడియల్ కళాశాల అధ్యాపకులు కే.రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు సందర్శించారు. ఎకరం పొలంలో 50నుంచి 60రకాల పంటలను ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండించి రూ.3లక్షల ఆదాయాన్ని ఎలా పొందాలో ప్రయోగ పూర్వకంగా తెలుసుకున్నారు.

ఆర్‌సీఎం చర్చి ప్రారంభం

ప్రత్తిపాడు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఇంద్రమహల్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని విశాఖఅగ్ర పీఠాధిపతి బిషప్ కుడుముల బాల శనివారం ప్రారంభించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ చినప్ప ఆధ్వర్యంలో ఈచర్చిని నిర్మించారు. కుడుముల బాల, చినప్ప క్రీస్తు సందేశాలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

రౌతులపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నాగులచవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పొలాల్లోకి వెళ్లి పుట్టల వద్ద నాగదేవతకు పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎస్.పైడిపాలలో గ్రామస్తులు వివిధ వేషధారణలతో ఇంటింటికి తిరిగారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): రౌతుపాలెం, పెద్దిపాలెం,లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి, రాచపల్లి, ప్రత్తిపాడు గ్రామాల్లో నాగులచవితి వేడుకలు నిర్వహించారు. నువ్వులు, గానుగ తెలగపిండి చిమిడి, తాటి ముంజుల గుంజు, పాలు వంటివి ప్రసాదంగా పుట్టల్లో పోశారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో ప్రజలు శనివారం నాగులచవితి పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న పొలాల్లోకి వెళ్లి పుట్టల్లో నాగేంద్రుడికి పాలు, గుడ్లు పోసి పూజలు చేశారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చి మధ్యాహ్నం కుటుంబీకులు సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పొలాల్లో పుట్టల్లో భక్తులు పాలు, చలివిడి, చిమిడి వేసి నాగదేవతకు పూజలు చేశారు. సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాల్లోఅభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): గోకవరం రోడ్డులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు జరిగాయి. భక్తులు సమీప పొలాల్లోకి వెళ్లి నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు.

'ఐటీడీఏ'లో కంట్రోల్ రూమ్

రంపచోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీనికోసం ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ నెం. 08864 242114ను ఏర్పాటు చేసినట్టు పీవో స్మరణ్‌రాజ్ తెలిపారు. పీవో మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందు వల్ల మైదాన ప్రాంతాల నుంచి ఎవరినీ అనుమతించొద్దని అధికారులను ఆదేశించారు.

27న పీసా కమిటీ ఎన్నికలు

వై.రామవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వై.రామవరం సచివాయలంలో సోమవారం పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు నిర్వహించ తలపెట్టినట్టు పీసా ఎన్నికల నోడల్ అధికారి, ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే గ్రామసభకు ఓటర్లు, ప్రజలు హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ ఎన్నికలు ఈనెల 30లోపు పూర్తి కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. గ్రామంలోని ఓటర్లు, ప్రజలు ఈ గ్రామసభకు తప్పనిసరిగా హాజరై పీసా కమిటీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : పీవో

రంపచోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. ప్రపంచ బాలి కల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శనివారం ఆయన వివిధ పోటీ ల్లో గెలుపొందిన విదార్థినులకు బహుమతుల ను అందజేశారు. పీవో మాట్లాడుతూ బాలికలు విదేశాలను శాసించే శక్తిగా ఎదగాలన్నారు. ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల వచ్చే అనర్థాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. సీడీపీవోలు కే.ఉమా, బీ.సుజిత, ఎల్. శాంతికుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు. అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో ఎల్టీఆర్ సెల్ ఏర్పాటు

చింతూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఐటీడీఏలో ఎల్టీఆర్ సెల్ ఏర్పాటు చేయనున్నట్టు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ కోర్టు డిప్యూటీ తహసీల్దార్ జే. విలెంటస్ నెలరోజుల పాటు ఈ సెల్‌లో విధులు నిర్వర్తించడం జరుగుతోందన్నారు. అదే దశలో ప్రతి బుధవారం చింతూరు ఐటీడీఏలో నిర్వహించే గ్రీవెన్సుకు రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ కోర్టుకు చెందిన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ హాజరవనున్నట్టు పీవో పేర్కొన్నారు.

వరద పరిహారానికి మోక్షమెప్పుడో?

కూనవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వరదలు వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య ఆరోపించారు. శనివారం ఆయన కూనవరంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కూలి పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నీటమునిగిన ఇళ్లకు రూ.10 వేలు, కూలి పనులు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు రూ. 3 వేలు ఇస్తామని ప్రకటించిందని, కానీ ఇప్పటికీ అందజేయలేదన్నారు. తక్షణమే వాటిని మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో తమ్మయ్య, తాళ్లూరు శ్రీనివాసరావు, కన్నయ్య, పోడియం రామారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

దేవీపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవారంలో శనివారం రాత్రి ఎస్ఐ షరీఫ్ సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆయా గ్రామాల్లో మూఢనమ్మకాలను నమ్మరాదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

రంపచోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించే ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు.